
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
3
బుధవారం 6 నవంబరు 2024



సెల్ఫ్‌డిఫెన్స్ ట్రైనర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్‌డిఫెన్స్ ట్రైనర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో బి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో శిక్షణ ఇచ్చేందుకు మూడు నెలల్లో 36 తరగతులు తీసుకోవలసి ఉంటుందన్నారు. అభ్యర్థులు 8వ తేదీసాయంత్రం 5 గంటలలోపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలోని యువజన, క్రీడా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానికులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

వైద్య సేవలు మెరుగుపరుస్తాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య సేవలు మెరుగుపరుస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో రోటీన్ ఇమ్యునైజేషన్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య సేవల్లో సమగ్రత, సామర్థ్యం పెంచడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, రాష్ట్ర స్థాయి శిక్షకుడు డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్, ఎస్‌యంవో డాక్టర్ అతుల్‌నిగమ్, డాక్టర్ జ్యోత్స్న, డేవిడ్, డీఐవో డాక్టర్ సాజిదఅతహరి, డాక్టర్ ఎ శ్రీనివాస్, డాక్టర్ చందు, బి క్రైక పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనలో జమ్మికుంటకు ప్రథమ స్థానం


ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య సేవలు మెరుగుపరుస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో రోటీన్ ఇమ్యునైజేషన్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య సేవల్లో సమగ్రత, సామర్థ్యం పెంచడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, రాష్ట్ర స్థాయి శిక్షకుడు డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్, ఎస్‌యంవో డాక్టర్ అతుల్‌నిగమ్, డాక్టర్ జ్యోత్స్న, డేవిడ్, డీఐవో డాక్టర్ సాజిదఅతహరి, డాక్టర్ ఎ శ్రీనివాస్, డాక్టర్ చందు, బి క్రైక పాల్గొన్నారు.

కూరగాయల దుకాణాలను మార్కెట్ కాంప్లెక్స్‌కు మార్చండి


చైతన్యపురి మార్కెట్ కాంప్లెక్సును పరిశీలిస్తున్న కలెక్టర్

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ కళాశాల, డిమార్ట్ రోడ్డుపై ఉన్న కూరగాయల దుకాణాలను చైతన్యపురి మున్సిపల్ మార్కెట్ క్యాంప్లెక్స్ కు వెంటనే తరలించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె చైతన్యపురి మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్సును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరు వ్యాపారుల కోసం నిర్మించిన ఈ మార్కెట్ కాంప్లెక్సు నిరుపయోగంగా ఉందన్నారు. చిరువ్యాపారులు రోడ్లపై కూరగాయలు అమ్ముకుంటున్నారని, దీంతో ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రమాదాలు జరురగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, మున్సిపల్ డీఈ వెంకటేశ్వర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ పరుశరాం పాల్గొన్నారు.

నాన్‌గెజిటెడ్ ఉద్యోగులందరూ సభ్యత్వం తీసుకోవాలి


కలెక్టర్ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాన్‌గెజిటెడ్ ఉద్యోగులందరూ సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం, అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఒక డీఏతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, తహసీల్దార్ రాజు, నరేందర్, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, టీజీవో నాయకుడు మడిపెల్లి కాళీచరణ్, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్‌భరద్వాజ్, నేరెళ్ల కిషన్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

భగత్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించడంతో పాటు, సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర కమిటీ, జేఏసీ పిలుపు మేరకు ఉద్యమాలను ముందుకు తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో జెఏసీ ఛైర్మన్ ఎంపీ రెడ్డి, వైస్ ఛైర్మన్ కొమురయ్య కేతిరి శంకర్‌రెడ్డి, జి రమేష్, బి శ్రీనివాస్, పీజే రెడ్డి, ఇ సంపత్ పాల్గొన్నారు.



సర్వేకు సర్వం సిద్ధం

- 1,958 ఎలక్టోరల్ బ్లాక్స్ ఏర్పాటు
- 1964 మంది ఎన్యూమరేటర్లు...207 మంది సర్వేయర్లు
- నేటి నుంచి ఇంటి నంబర్ల కేటాయింపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి సర్వే ప్రారంభం కానుంది. జిల్లాలోని 15 మండలాలు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలను 1,958 ఎలక్టోరల్ బ్లాక్‌లుగా విభజించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు 1964 మంది ఎన్యూమరేటర్లను, 207 మంది సర్వేయర్లను నియమించారు. ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకాధికారులు సర్వేను నిరంతరం పర్యవేక్షిస్తారు.

సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి

ఇప్పటికే సర్వేపై అవగాహనకల్పించిన జిల్లా యంత్రాంగం మంగళవారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి అధికారులు, సిబ్బందిని బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సర్వేలో పాల్గొనేలా అప్రమత్తం చేసింది. ఇంటి నంబర్ల కోసం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఇం టి యజమానులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. దరఖాస్తులను మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది వెరిఫికేషన్ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. ప్రశ్నావళిలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా చదివి తప్పుడు సమాచారమివ్వకుండా ఎన్యూమరేటర్లకు సహకరించి సర్వే విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తప్పుడు సమాచారమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లకు సర్వే బాధ్యతలను అప్పగించారు.

కంప్యూటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సిద్ధం

బుధవారం నుంచి సర్వే పూర్తయ్యే వరకు సర్వే విధుల్లో పాల్గొంటున్నందున పాఠశాలలు ఉదయం ఒక పూట మాత్రమే నిర్వహిస్తారు. మధ్యాహ్నం నుంచి వారు సర్వే విధుల్లో పాల్గొంటారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల అంశాలతో చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ముందుగా ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి నెంబర్లను కేటాయించి స్టికర్లను అతికిస్తారు. ఇంటి నంబర్ లేకపోతే సర్వేచేసిన అనంతరం ఆన్‌లైన్‌లో పొందుపరచడం వీలు కాదు. సూపర్‌వైజర్లు వారికి కేటాయించి బ్లాకుల్లో క్షేత్రస్థాయికి వెళ్లి కనీసం 10శాతం ఇండ్లను సందర్శించాల్సి ఉంటుంది. సర్వే సమాచారాన్ని ఎప్పటికప్పుడు కంప్యూటర్లలో నిక్షిప్తం చేసే విధంగా కంప్యూటర్లను, డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే సర్వేకు సంబంధించిన స్టేషనరీ, ప్రశ్నావళి పత్రాలను, స్టిక్కర్లను బ్లాకులకు చేరవేశారు. సర్వే కోసం ఇంటికి ఎప్పుడు వస్తారనే విషయాన్ని సంబంధింత యజమానికి తెలిపి ప్రశ్నావళిలోని సమాచారాన్ని తెలుసుకుంటారు. 25 రోజులపాటు సాగే ఈ సర్వేలో విధులను కేటాయించిన ఎన్యూమరేటర్లు, సర్వేయర్లు, అధికారులు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది.

ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ చేయాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

సమగ్ర ఇంటింటి సర్వేకు సంబంధించి ఎనుమరేషన్ బ్లాక్‌లో ఇళ్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని, ప్రతి ఇంటికి వెళ్లి

మిగతా 6వ పేజీలో...

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు


మహాశక్తి ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పూజలను భక్తులు మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టల్లో పాలు పోసి బియ్యం, నువ్వుల పిండి ముద్దలు, నూక, గుడ్లు, పండ్లు, వెండి చెవులు, కళ్లు, పడిగెలు సమర్పించి పుట్ట మట్టిని బంగారంగా భావించి తిలకధారణ చేసుకున్నారు. యజ్ఞ వరాహస్వామిక్షేత్రంలో అనంతనాగేంద్రస్వామి, కృష్ణానగర్ రాహుకేతు సహిత సంతానప్రద అనంతనాగేంద్రస్వామి, చైతన్యపురి మహాశక్తి ఆలయం, పాతబజార్ శివాలయం, భగత్‌నగర్ అంజనాద్రి, అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాళ్లు, ప్రశాంతనగర్ ప్రసన్నాంజేయస్వామి ఆలయాలతో పాటు సుబ్రహ్మణ్య, నాగేంద్రస్వామి, పుట్టలున్న ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బొమ్మకల్‌రోడ్ చింతలకింద, శ్రీపురం సమీపంలో, కోర్టు చౌరస్తా వద్ద గల పుట్టల్లో భక్తులు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

- హుజూరాబాద్: పట్టణ పరిధిలోని కొత్తపల్లి నాగేంద్రస్వామి ఆలయంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారికి అభిషేకాలు, పుట్టలో పాలు పోశారు.


హుజూరాబాద్‌లో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు, కరీంనగర్‌లో మొక్కుతున్న మహిళ

విద్యార్థులను విజ్ఞానులుగా తీర్చిదిద్దాలి

కరీంనగర్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సులభమైన పద్ధతుల్లో విద్యాబోధన చేసి విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సైన్స్ సమాచారం ఎక్కువగా ఇంగ్లీష్‌లో ఉంటుందని, ఉపాధ్యాయులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని అన్నారు. పరిసరాల మీద అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పిల్లల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీసినప్పుడే ఆవిష్కరణలు, అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్‌రావు, క్వాలిటీ కో ఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి మారం స్వదేశీకుమార్, సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, ఎంఈవో ప్రమోద, జెండర్ ఈక్విటీ కో ఆర్డినేటర్ డాక్టర్ కృపారాణి, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

ఆసరా కోసం ఎదురుచూపులు

- ప్రభుత్వ కార్యలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చిగురుమామిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు సంవత్సరాలుగా ఆసరా పింఛన్లకు అతీగతి లేకుండా పోయింది. 2019 ఆగస్టు నుంచి నేటి వరకు ఆసరా ఫింఛన్ల వెబ్‌సైట్ తెరుచుకోలేదు. మండల వ్యాప్తంగా 650 దరఖాస్తులు



పెండింగ్‌లో ఉన్నాయి. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో నిర్వహించిన సభలు, సమావేశాల్లో వినతిపత్రాలు ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పింఛన్లు ఇప్పించాలని కోరుతున్నారు.

దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు..

- అన్న సమ్మయ్య, దివ్యాంగుల సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ బాధ్యుడు

ఐదు సంవత్సరాలుగా పింఛన్లు రావడం లేదు. దివ్యాంగులు దరఖాస్తు చేసుకుని అనేక ఇబ్బందులు పడుతున్నారు. సదరమ్ క్యాంపులో సర్టిఫికెట్స్ తీసుకుని, అన్ని పత్రాలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

రెండు కాళ్లు పోయాయి.. ఫింఛన్ రావడం లేదు..

- నిజానం రాజయ్య, సుందరగిరి



అనారోగ్య సమస్యతో నా రెండు కాళ్లు తీసి వేశారు. ఫింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడిచింది. ఇప్పటికీ మంజూరు కాలేదు. అధికారులను అడుగుతే సైట్ ఓపెన్ కావడం లేదని అంటున్నారు. మందులకు, ఇతర ఖర్చులకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం కనికరించి పింఛన్ మంజూరు చేయాలి.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, LANKADASARI SWARUPA, W/O. LANKADASARI SAMPATH, R/O. H.NO. 1-44/1, SAMBAIAHPALLY, SULTANABAD, PEDDAPALLI. HAVE CHANGED MY NAME AS " LANKADASARI PRAVALIKA " W/O. LANKADASARI SAMPATH.
AJK-16124

CHANGE OF NAME
★ WE, SOOR RAAJAIAH S/O.SOOR RAAJAIAH & M/O. SOOR ILAMMA & H/O. SOOR LAXMI, R/O. H.NO: 2-23/20, JUBLINAGAR, KARIMNAGAR, WE HAVE CHANGED OUR'S SURNAME AS "SURA RAJAIAH S/O. SURA RAAJAIAH & M/O. SURA ILAMMA & H/O. SURA LAXMI.
AJK-16125

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640
జగిత్యాల :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

న్యూస్ బాక్స్

రేషన్‌డీలర్ సస్పెన్షన్

కరీంనగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామ రేషన్ డీలర్ సిహెచ్ రాజయ్యను సస్పెండ్ చేస్తూ సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేషన్ డీలర్ బియ్యం సరఫరా సక్రమంగా చేయడం లేదని పలువురు లబ్ధిదారులు ఫిర్యాదు చేయగా విజిలెన్స్ అధికారులు రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌లో తేడా రావడంతో అధికారులు సివిల్ సప్లయిస్ అధికారులకు నివేదిక పంపించారు. దీంతో మంగళవారం సివిల్ సప్లయిస్ అధికారు అధికారులు డీలర్ రాజయ్యను శాఖపరమైన కేసు నమోదు చేశారు. బియ్యం బస్తాల స్టాక్‌లో 6క్వింటాళ్లకు పైగా తక్కువ వచ్చిందని అదికారులు తెలిపారు. రేషన్ సరుకులను ఇవ్వడానికి చామనపల్లి డీల ర్ వెంకటేష్‌కు బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అస్తిపంచి ఇవ్వాలని తరచుగా కుమారుడు వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ తండ్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన హస్నాబాద్‌లో చోటు చేసుకుంది. హస్నాబాద్‌కు చెందిన చాట్లపెల్లి గంగారాం(65) అనే వృద్ధుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి ప్రాంతానికి చెందిన పెద్ద కుమారుడు తిరుపతి కొన్ని రోజులుగా తన తండ్రిని ఆస్తి పంచి ఇవ్వాలని వేధిస్తున్నాడు. సోమవారం ఫోన్‌లో తన తండ్రితో ఆస్తి పంచి ఇవ్వాలంటూ వేధించాడు. తీవ్ర మనోవేదనకు గురైన గంగారాం మంగళవారం వేకువజామున తన ఇంటిలో ఉన్న రేకుల షెడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సెల్‌పాయింట్‌లో చోరీ

జగిత్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న శ్రీగాయత్రీ సెల్ పాయింట్‌లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. షాపు వెనుకభాగంలో ఉన్న వెంటిలేటర్‌ను పగులగొట్టిన దొంగలు షాపులోకి చొరబడి రూ. 15 వేల నగదుతో పాటు ఐదు లక్షల విలువ చేసే సెల్ ఫోన్లను అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కంప్యూటర్ యుగంలోనూ టైప్ హవా..



ఒకప్పుడు పదోతరగతి పూర్తి కాగానే వేసవి సెలవుల్లో విద్యార్థులందరూ టైప్ నేర్చుకునేందుకు వెళ్లేవారు.. కంప్యూటర్ల రాకతో టైప్ జోరు తగ్గింది. ప్రభుత్వ ఉద్యోగా వకాశలు ఉండడంతో మళ్లీ యువత టైప్ నేర్చుకు నేందుకు మొగ్గు చూపుతున్నారు. కంప్యూటర్ కీబోర్డుపై పట్టు సాధించేందుకూ టైప్ నేర్చుకుంటున్నారు. దీంతో టైప్ ఇనిస్టిట్యూట్లు కళకళలాడుతున్నాయి.

- ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగవకాశాలు
- టైప్ ఇనిస్టిట్యూట్లకు తగ్గని ఆదరణ



టైపురైటింగ్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

సిరిసిల్లటౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ యుగంలోనూ టైప్ రైటింగ్‌కు ఆదరణ తగ్గడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలల్లోని కొన్ని శాఖల్లో ఇప్పటికీ టైపు రైటర్లకు అవకాశాలు ఉంటున్నాయి. ఈ అవకా శాలను సద్వినియోగం చేసుకుంటున్న యువత టైప్ రైటింగ్ నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా టైపురైటింగ్ రాక ఇబ్బం ది పడుతున్న కొంతమంది ఉద్యోగులు కూడా రోజుకో గంట టైపురైటింగ్ ఇనిస్ట్యూట్‌లలో శిక్షణ పొందుతు న్నారు. కంప్యూటర్ కీబోర్డు వేగంగా ఆపరేటర్ చేయాలనుకునే వారు ముందుగా టైప్ ఇనిస్టిట్యూట్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. పోలీస్‌శాఖ, కోర్టుల్లో, మెడికల్ విభా గాల్లో టైప్ రైటర్లకు ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగ పోటి పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు టైపురైటింగ్ నేర్చుకొంటున్నారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో లోయర్, హయ్యర్ టైపురైటింగ్ శిక్షణకేంద్రాల్లో విద్యా ర్థులు శిక్షణ పొందుతున్నారు. దాదాపు ఆరునెలల కాల వ్యవధిలో ఎంచుకున్న కోర్సును పూర్తి చేస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు

పోలీసుశాఖ, కోర్టు వ్యవహారాలకు సంబంధించి ఇప్ప టికీ టైపు రైటింగ్ తప్పనిసరిగా మారింది. పోలీసు కాని స్టేబుల్ ఉద్యోగం సాధించిన యువతీయువకుల్లో టైపు రైటింగ్‌లో ప్రావీణ్యం ఉన్నవారు రైటర్లుగా, స్టెనో గ్రాఫర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కోర్టు టైపురైటింగ్ వచ్చిన కానిస్టేబుళ్ల వారెంట్‌లు ఇష్యూ చేస్తున్నారు.

● టైపు రైటింగ్‌తోనే ఉద్యోగం



టైపురైటింగ్ శిక్షణతో ఉద్యోగం సాధించా. అంతకు ముందు తెలుగు, ఇంగ్లీష్ లోయర్, హైయర్ టైపురైటింగ్ శిక్షణ పొందాను. పరీక్షలో అత్యధిక మార్కులు సాధిం చాను. ప్రస్తుతం సిరిసిల్ల కోర్టులో స్టెనో టైపిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాను.

- గాజుల రజని, కోర్టు స్టెనో టైపిస్ట్, సిరిసిల్ల

● టైప్ రైటింగ్ నేర్చుకోవాలి



ఉన్నత పాఠశాల విద్యాభ్యాసన సమయంలోనే టైప్ రైటింగ్ నేర్చుకోవాలి. కంప్యూటర్ యుగంలో ఉన్నత విద్యతోపాటు టైప్‌లో శిక్షణ పొంది ఇంగ్లీష్, తెలుగులో లోయర్, హైయర్‌లో స్టేట్‌బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు వస్తాయి. నాతో పాటు శిక్షణ పొందిన చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు.

- రెడ్డిమల్ల నర్సయ్య, కోర్టు స్టెనో టైపిస్ట్, వేములవాడ

పాఠశాలలో నాగుపాము కలకలం



పాఠశాల ఆవరణలో నాగుపాము

సిరిస్లిల రూరల్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నాగుపాము కలకలం సృష్టించింది. పాఠశాలలోని మరుగుదొడ్ల వద్ద తిరుగుతున్న నాగుపామును చూసిన విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పారు. వెంటనే పైపుల కిందికి దూరుతున్న పామును గుర్తించిన ఉపాధ్యాయులు పామును చంపేశారు. పాఠశాల మానేరు వాగు ఒడ్డున ఉన్నందున అక్కడి నుంచి పాములు పాఠశాల ఆవరణలోకి వస్తున్నట్లుగా గుర్తించామని, జిల్లా అధికారులు స్పందించి పాముల నివారణకు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ సుచరిత ఒకప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని గోదావరిఖని, హుజూరాబాద్, కరీంనగర్-1, జగిత్యాల, వేములవాడ డిపోల నుంచి బస్సులు ఉంటాయన్నారు. ఈ నెల13వ తేదీన బస్సులు బయలుదేరి 16న తిరిగి వస్తాయన్నారు. అరుణాచలానికి బస్సులు బయలుదేరి దారిలో కాణిపాకం, వెల్లూరు పుణ్య క్షేత్రాల సందర్శన కూడా ఉంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో జోగులాంబ గద్వాల నుంచి తిరిగి వస్తాయన్నారు.

ఛార్జీల వివరాలు:

డిపో	పెద్దలకు	పిల్లలకు	సర్వీసునెంబరు
గోదావరిఖని	4,850	4,000	69999
హుజూరాబాద్	4,500	3,800	75557
కరీంనగర్-1	4,500	3,800	75558
జగిత్యాల	4,700	3,900	75556
వేములవాడ	4,500	3,800	75555

మరిన్ని వివరాలకు సమీప డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల సౌకర్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం అన్నారు.

వాహనాల తనిఖీ

మెట్‌పల్లి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం సాయంత్రం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అక్రమంగా గంజాయి, మద్యం, నాటుసారా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రిబుల్ రైడ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామని అన్నారు. మైనర్లు, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, అనిల్, రాజు, కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వర్షకొండ గ్రామ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న మోర్తాడ్ గ్రామానికి చెందిన ఇమ్రాన్ హైమద్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

శంకరపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లికి చెందిన చెందిన దాసారపు శ్యామ్ (28) అనే యువకుడు ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గోనె సంచుల టెండర్లలో భారీ స్కామ్

- బీజేపీ విచారణ జరిపించి అక్రమాలను వెలికితీయాలి
- సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోనె సంచుల కొనుగోలు టెండర్ల నిబంధనలు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం భారీ స్కామ్‌కు తెరలేపిందని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత దాన్ని బియ్యంగా తయారు చేసి గోనె సంచుల్లో నింపుతారని అన్నారు. ఆ గోనెల సంచుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టెండర్లను పిలిచిందని చెప్పారు. తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో 14.50 రూపాయల నుంచి 16 రూపాయలకు ఒక గోనె సంచి కొనుగోలుకు టెండర్లు పిలిచామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను ఎందుకు మార్చిందని ప్రశ్నించారు. ఓ వ్యక్తి సిఫారసు ద్వారా టెండర్‌లో నిబంధనలు మార్చారని, ఆయనే కమీషన్లను వసూలు చేస్తూ షాడో మంత్రిగా పనిచేస్తున్నాడని విమర్శించారు. ఆ షాడో వ్యక్తి ద్వారానే ఏ పని అయినా అవుతుందని, అధికారుల బదిలీలు కూడా ఆయన కనుసన్నల్లో జరుగుతాయని రవీందర్‌సింగ్ ఆరోపించారు. బీజేపీ సీఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి ప్రతిరోజు రైతుల కోసం మాట్లాడుతున్నారని, ఈ విషయమై కేంద్రానికి ఫిర్యాదు చేసి విచారణ జరిపించి అక్రమాలు వెలికి తీయించాలని డిమాండ్ చేశారు. గోనె సంచుల కుంభకోణంపై స్పందించకుంటే కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని రవీందర్‌సింగ్ స్పష్టం చేశారు. హరీష్‌రావును అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిపి పనిచేస్తున్నాయని రవీందర్‌సింగ్ విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెంసారం తిరుపతి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, గొట్టం మహేశ్, నర్సయ్య, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- డీఆర్‌వో వెంకటేశ్వర్లు

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఎలక్టోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈనెల 4 నాటికి ఆయా జిల్లాల్లోని 271 మండలాల్లో 2,60,044 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని 16 మండలాల నుంచి ఆఫ్‌లైన్‌లో 210, ఆన్‌లైన్‌లో 58,657 మొత్తం 58,867 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి 271 మండలాల్లో 18,913 మంది ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారని, జిల్లాలో 2959 దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఓటరు నమోదులో తలెత్తుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు మడుపు మోహనాచారి, సత్తినేని శ్రీనివాస్, సిరిసిల్ల అంజయ్య, నాంపల్లి శ్రీనివాస్, ఎం.వాసుదేవరెడ్డి, కల్యాడపు ఆగయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకొని..

పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి హల్‌చల్

కోరుట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని మంగళవారం హల్‌చల్ సృష్టించాడు. గమనించిన పోలీసులు, స్థానికులు యువకుడిపై నీటిని పోసి అడ్డుకున్నారు.

స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గంగంపేట ప్రాంతానికి చెందిన ఓ వివాహితకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహితతో అదే కాలనీకి చెందిన షారుఖ్ అనే యువకుడు సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయం వివాహిత కుటుంబ సభ్యులకు తెలియడంతో రెండు రోజల క్రితం వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు రెండు రోజుల క్రితం యువకుడిని పిలిపించుకొని మాట్లాడి వివాహితతో ఉండవద్దని పెద్దల సమక్షంలో ఒప్పించి పంపిచారు. వివాహితకు తనను దూరం చేశారని అంటూ మంగళవారం మధ్యాహ్నం షారుఖ్ పెట్రోల్ బాటిల్‌తో పోలీస్‌స్టేషన్ సమీపంలోకి చేరుకొని ఒంటిపై పోసుకున్నాడు. అక్కడే ఉన్న స్థానికులు, పోలీసులు గమనించి అతడిపై అక్కడే ఉన్న నీటిని పోశారు. పెట్రోల్ నోట్లోకి వెళ్లడంతో షారుఖ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

ఓదెల లో శతాధిక వృద్ధురాలు మృతి



పోచమ్మ (ఫైల్)

ఓదెల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒర్రెగడ్డలో మంగళవారం చింతం పోచమ్మ(105) అనే శతాధిక వృద్ధురాలు మృతిచెందింది. వృద్ధురాలు ఇన్నాళ్ల వృద్ధాప్యంలో కూడా తన దిన చర్యలను ఆమె సొంతంగా చేసుకుంది. 50 ఏళ్ల క్రితం భర్త లింగయ్య మృతిచెందగా, అప్పటినుంచి కొడుకు రాజయ్య వద్ద ఉంటోంది. వృద్ధు రాలికి కొడుకు, కూతురు కాగా, ఈమె తోడబుట్టిన వారిలో ఈమె పెద్దది. ప్రస్తుతం ఎవరు కూడా బతికి లేరు. పోచవ్వ అంత్య క్రియలకు తన బంధువులతోపాటు గ్రామస్తులంతా హాజరయ్యారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరు మృతి



పెసరి స్వామి(ఫైల్)

ధర్మారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండలం కటికెనపల్లి వద్ద కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అదే గ్రామా నికి చెందిన పెసరి స్వామి(48) మృతిచెందగా, మిట్ట ఆశాలు అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. మృతుడు తన బైక్‌పై మిట్ట ఆశాలును తీసుకొని కరీంనగర్ రోడ్డు నుంచి కట్టికెనపల్లి గ్రామంలోనికి ప్రవేశిస్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో పెసరి స్వామి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు

శంకరపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుక్కలు అడ్డురావడంతో బైక్‌పై నుంచి అదుపు తప్పి గాయపడ్డ లింగంపల్లి నారాయణరెడ్డి (70) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన కాచాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి నారాయణరెడ్డి గత నెల 20న తన ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వెళ్తుండగా కొత్తగట్టు సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ నారాయణరెడ్డిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నారాయణరెడ్డి కుమారుడు కిషన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో ఓ దొంగతనం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, గంజాయి కేసులో మరొకరికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణం జయనగర్‌కు చెందిన పుదారి రాజు 11 నవంబరు 2017న అంబికానగర్‌లోని ఒక ఇంట్లోకి చొరబడి రూ.97 వేల విలువగల వస్తువులు ఎత్తుకెళ్లాడు. ఆ ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పుదారి రాజును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. న్యాయమూర్తి ప్రవీణ్ కేసు పూర్వపరాలు పరిశీలించి పుదారి రాజుకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేలు జరిమానా విధించారు. గంజాయి కేసులో సిరిసిల్ల పట్టణం శివనగర్‌కు చెందిన బలవేణి సుమన్ అలియాస్ అర్జున్ గంజాయి విక్రయిస్తుండగా 9 సెప్టెంబరు 2023న సిరిసిల్ల పట్టణం కార్గిల్ లేక్ వద్ద పోలీసులు అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. న్యాయమూర్తి ప్రవీణ్ పూర్వపరాలు పరిశీలించి బలవేణి సుమన్‌కు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.5 వేల జరిమాన విధించారని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గొల్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొత్తునూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ లక్కం భాగ్యవ్వ (60) అనే మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. భాగ్యమ్మ సోమవారం రాత్రి కల్లెడ-వెల్గటూర్ రోడ్డుపై గ్రామంలోని ఓ కిరాణా దుకాణానికి వెళ్లి రోడ్డు దాటు తుండగా పల్లపు వెంకటస్వామి అనే వ్యక్తి తన ద్విచక్రవాహంతో ప్రమాదవశాత్తు భాగ్యవ్వను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భాగ్యవ్వ తలకు తీవ్ర గాయాలు కాగా, కుటుంబ సభ్యులు కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురికి కాలువలో పడి యువకుడి మృతి

జగిత్యాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మురికి కాలువలో మద్యం మత్తులో పడి యువకుడు మంగళవారం మృతి చెందాడు. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన మద్దెల సాగర్(38) అనే యువకుడు 10 సంవత్సరాలుగా జిల్లా కేంద్రంలోని హోటల్‌లో పనిచేస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో హోటల్ ఎదుట ఉన్న మురికి కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టవర్ ఎక్కి యువకుడి హంగామా

పెద్దపల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన రాకేష్ అనే యువకుడు మంగళవారం విద్యుత్ టవర్ ఎక్కి హంగామా సృష్టించాడు. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్.స్వామి, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని నచ్చజెప్పినా వినకుండా రాత్రి వరకు వరకు కిందకి దిగలేదు.. స్థానికులు ఎంత బ్రతిమిలాడిన కూడా యువకుడు కిందకి దిగలేదు. యువకుడు టవర్ దిగి సమస్య చెపితేనే కారణాలు తెలిసే పరిస్థితి ఉంది. యువకుడిని కిందికి దింపేందుకు పోలీసులు, గ్రామస్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



అరుణ్(ఫైల్)



శశిధర్(ఫైల్)

రామడుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మండల కేంద్రానికి చెందిన నీలం అరుణ్(20), సామంతుల శివాజి అలియాస్ శశిధర్(18) అనే ఇద్దరు యువకులు కరీంనగర్‌కు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై రామడుగుకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మినీ ట్రక్కు ఢీకొంది. ఈ ప్రమాదంలో శశిధర్ అక్కడికక్కడే మృతి చెందగా, నీలం అరుణ్ బైక్‌పై నుంచి ఎగిరి పడ్డాడు. తీవ్రంగా గాయ పడ్డ అరుణ్‌ను గ్రామస్థులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన వాహనం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడిమ్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మాలాపూర్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బోయిని శివమణి కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి జ్యోత్స్నదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14 కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనందుకు శివమణిని శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ నెల 8న యాదాద్రి భువనగిరి జిల్లాలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న క్రీడల్లో శివమణి ఆడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆదిరెడ్డి, గ్రామస్థులు నర్సయ్య, సత్యం, మహేష్, రాజు, సాయిలు, సతీష్ ఉన్నారు.

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్‌లోని శ్రీచైతన్య హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న బి వర్షిత్ ఎంపికైనట్లు పీఈటీలు ప్రశాంత్, వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీన హుజూరాబాద్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వర్షిత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వర్షిత్‌ను పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పూర్ణచందర్ అభినందించారు.



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీపోటీలకు ఎంపికైన వర్షిత్



దేవునిపల్లిలో సంతోష్ సాగు చేసిన వంకాయ తోట



అంటు పద్ధతి ద్వారా పెరిగిన మొక్కను చూపిస్తున్న రైతు

'అంటు' పద్ధతితో
అధిక దిగుబడి..

పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ యువ రైతు కూరగాయల సాగులో నూతన పద్ధతులను అవలంభిస్తున్నాడు. సాధారణంగా పండ్ల మొక్కలకు అంటు కట్టడం మనకు తెలుసు. కానీ ప్రస్తుతం కూరగాయల మొక్కలకు సైతం అంటు కడుతున్నారు. ఈ 'అంటు' పద్ధతిలో చేస్తున్న వ్యవసాయంతో రెట్టింపు దిగుబడిని సాధ్యమవుతుంది. పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన ఓ యువ రైతు ఈ విధాన్ని అవలంభిస్తున్నాడు. మండలంలో ఇప్పటివరకు ఇలాంటి సాగు విధానం లేకపోవడవంతో పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దేవునిపల్లి గ్రామానికి వచ్చి సాగు పద్ధతిని పరిశీలించి రైతును వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

పెద్దపల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన బొక్కల సంతోష్ అనే యువ రైతు వంకాయ సాగులో నూతన పద్ధతిని పాటిస్తున్నాడు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రలోని మిత్రుల ద్వారా 'అంటు' పద్ధతి గురించి తెలుసు కున్నాడు. వంకాయ సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు ఈ విధానం తోడ్పడుతుందని వారు సలహా ఇచ్చారు. దీంతో ఐదునెలల క్రితం హైదరాబాద్‌లోని నర్సరీల్లో లభించే 'అంటు' మొక్కలను పరిశీలించాడు. అడవిజాతి వంకాయ మొక్కకు మామూలు వంకాయ మొక్కను అంటు కట్టడంతో ఇవి తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడిని ఇస్తాయని తెలుసుకున్నాడు. స్థానికంగా రూ.1 చొప్పున లభించే వంకాయ మొక్కల కంటే 'అంటు' మొక్కలకు కాస్త రేటు ఎక్కువే అయినా రెట్టింపు దిగుబడి వస్తుందని ఆశించాడు. ఒక్కో మొక్కకు రూ.9 చొప్పున(ట్రాన్స్‌పోర్టుతో ఖర్చుతో కలిపి) కొనుగోలు చేసి తీసుకొచ్చి ఎకరానికి 1400 చొప్పున తనకున్న మూడు ఎకరాల్లో మొక్కలను నాటాడు. వంకాయ పంటకు అధికంగా సోకే అజింక వైరస్‌ను ఈ మొక్కలు తట్టుకోవడంతో పాటు దిగుబడి అధికంగా వస్తోందని రైతు సంతోష్ తెలిపాడు. 75 రోజుల తర్వాత దిగుబడి రావడం ప్రారంభం కాగా, రోజు విడిచి రోజు సుమారు రెండు క్వింటాళ్ల దిగుబడిని సాధిస్తున్నాడు.

● వంకాయ సాగులో యువరైతు ఆదర్శం..



అడవి వంకాయ చెట్టుకు కాసిన కాయలు

● అంటు పద్ధతి ప్రయోగం బాగుంది..



సాధారణంగా ప్రతి ఏటా పొలంతో పాటు, కూరగాయల పంటను సాగు చేసే వాడిని. కానీ దిగుబడి తక్కువగా వచ్చేది. నా మిత్రుల ద్వారా అంటు పద్ధతిలో సాగు గురించి తెలుసుకొని వంకాయ పంట వేశాను. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొక్కలు చనిపోకపోగా ఏపుగా పెరిగి మంచి దిగుబడినిచ్చాయి. అంటుపద్ధతి ద్వారా సాగు రైతులకు లాభదా యకంగా ఉంటుంది. ఎక్కువకాలం దిగుబడి వస్తుంది.

- బొక్కల సంతోష్, దేవునిపల్లి

● తక్కువ నష్టం.. ఎక్కువ లాభం..

కూరగాయల సాగును సంతోష్‌కు ఏటా వర్షాలు భారీగా కురిసి తోట పూర్తిగా నష్టం వాటిల్లేది. ఈ ఏడాది అంటు పద్ధతిలో వంకాయ సాగు చేయడంతో వరదలు వచ్చినా పంటలకు ఎలాంటి తెగుళ్ల సోకక పోవడంతో పాటు మొక్కలు చనిపోలేదు. అలాగే వంకాయ పంటకు అధికంగా సోకే అజింక వైరస్ సైతం లేకుండా పోయింది. మరోవైపు వంకాయ సాగులో గతంలో నామ మాత్రంగా కేవలం ఏడాదిపాటు మాత్రమే దిగుబడి వచ్చేది. కానీ అంటు పద్ధతిలో సాగు చేస్తే రెండింతలు దిగుబడి వస్తోంది. ఈ పద్ధతి ద్వారా రెండేళ్లపాటు దిగుబడి వస్తుందని రైతు సంతోష్ పేర్కొంటున్నాడు.

ఉషు పోటీల్లో ఉమ్మడి జిల్లాకు పతకాలు

22 పతకాలతో ప్రథమ స్థానంలో నిలిచిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పతకాలతో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17, అండర్-19 ఉషు పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈనెల 2, 3 తేదీల్లో మహబూబాబాద్‌లో నిర్వహించిన పాఠశాలల క్రీడా సమాఖ్య 68వ రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటి 22 పతకాలను సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో సీహెచ్ విప్లవ్, కె పవన్, బి కార్తీక్, ఇ సంజయ్(ఢిల్లీ జూనియర్ కళాశాల), కె శివసాయి(అల్ఫోర్స్ జూనియర్ కళాశాల), డి కావ్య (రాచర్ల జూనియర్ కళాశాల), డి సోని(కస్తూర్బా కళాశాల, సిరిసిల్ల) బంగారు పతకాలు సాధించారు. ఎస్ అరుణ్, బి శివాత్మిక (ఢిల్లీ జూనియర్ కళాశాల), కె అక్షిత, ఎ చందన(రాచర్ల జూనియర్ కళాశాల) రజత పతకాలు సాధించారు. కె జస్వంత్, డి అంజనీ ప్రియ, ఎస్ శ్రీజ (ఢిల్లీ జూనియర్ కళాశాల), ఎండి రఫిక్, ఎండి అయాన్ (ఫండస్ పాఠశాల), కె లక్ష్మి సందీప్, పి శ్రీరామ్ యాదవ్(జడ్పీహెచ్‌ఎస్ సిరిసిల్ల), బి మౌనిక, బి దీపిక, బి పూజ(కస్తూర్బా సిరిసిల్ల), కె స్నేతిక(భగవతి కరీంనగర్), జి ప్రవళిక(జడ్పీహెచ్‌ఎస్ సిరిసిల్ల) కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా విద్యా శాఖాధికారి వి జనార్ధన్‌రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా జూనియర్ కళాశాలల కార్యదర్శి జి మధు జాన్సన్, పాఠశాలల కార్యదర్శి బి వేణుగోపాల్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఉషు సంఘ ప్రధానకార్యదర్శి బార విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు గోపు సుశాంక్‌రెడ్డి అభినందించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు



క్రీడాకారులతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా అండర్-14 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 140 మంది బాలబాలికలు హాజరయ్యారు. జిల్లా యువజన క్రీడా అభివృద్ధి శాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహిచారు. ప్రతిభ చాటిన బాల బాలికలను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈనెలలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అంతడుపుల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్ల పెటా అధ్యక్షుడు డాక్టర్ సురేందర్, హ్యాండ్‌బాల్ పోటీల కన్వీనర్ జి శ్రీనివాస్, పీడీలు అశోక్, రాజ్‌కుమార్, తిరుమలేష్, సుమన్, ప్రసాద్, కోచ్‌లు శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారి

గుంతలమయమైన కరీంనగర్-రాయపట్నం రోడ్డు



వల్లంపహాడ్ బ్రిడ్జిపై ఏర్పడిన గుంత

కరీంనగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి రాయపట్నం వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కరీంనగర్ మండలం వల్లంపహాడ్ బ్రిడ్జి సమీపంలో భారీ గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి వెంబడి వేలాది వాహనాలు కరీంనగర్ మీదుగా మంచిర్యాల వైపు ప్రయాణాలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో అతివేగంతో వచ్చే వాహనాలు గుంతల్లో పడి తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



వల్లంపహాడ్ సమీపంలో రహదారిపై ఏర్పడిన గుంత

ప్రజలకిచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కాంగ్రెస్ మహారాష్ట్రలో ఇచ్చిన పేపర్ ప్రకటనలు చూపిస్తున్న బండి సంజయ్

రుద్రంగి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ తెలంగాణ ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల హామీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి మండల కేంద్రంలో రూ.22లక్షల విలువైన ఎంపీ లాడ్స్ ఉపాధి హామీ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. ముందుగా స్థానిక లక్ష్మినర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు సమాధానం చెప్పే దమ్ముందా? అని ప్రశ్నించారు. సమాధానం చెప్పిన తరువాతే రాహుల్ గాంధీ తెలంగాణకు రావా లన్నారు.

ఎన్నికల హామీలతో కర్ణాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ మహారాష్ట్రలోనూ దొంగ హామీలు, అబద్ధాలతో ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు, ఎంతో అభివృద్ధి చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటూ మహారాష్ట్రలోని పేపర్లకు యాడ్స్ ఇవ్వడం సిగ్గు చేటన్నారు. గతంలో కేసీఆర్ ఇలాగే తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర, పంజాబ్‌ల్లో పంచారని, కాంగ్రెస్ నేతలు కేసీఆర్‌ను మించిపోయారని మండి పడ్డారు. ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతూ మహారాష్ట్ర ఎన్నికలకు తెలం గాణ పైసలను వాడుకుంటారా.. సిగ్గుండాలే.. అని విమ ర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు కాలేదని, రుణ మాఫీ పూర్తి కాలేదని అన్నారు. 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారన్నారు. మహారాష్ట్రలో మాత్రం రుణమాఫీ చేసినట్లు, గ్యారంటీలను అమలు చేసినట్లు గొప్పగా ప్రకటనలు ఇస్తున్నారని, మహారాష్ట్ర చెవిలో పూలు పెడదామనుకుంటున్నారని అన్నారు. దొంగ హామీలతో కర్ణాటక, తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చినట్లుగా మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావడం సిగ్గు చేటన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలన్నారు. పాదయాత్రలో మూసీ వద్దకు వెళ్లినప్పుడు విషం గక్కుతున్న నీళ్లను కళ్లారా చూశానన్నారు. సాగునీరు సంగతి దేవుడెరుగు.. యాదాద్రి జిల్లా ప్రజలు తాగునీటిని కొనుక్కునే పరిస్థితి ఉందన్నారు. మూసీని ప్రక్షాళన చేయాలని మొదటి నుంచి బీజేపీ కోరుతోందని కానీ ఆ పేరుతో పేదల ఇళ్లను కూల్చవద్దన్నది తమ డిమాండ్ అన్నారు. మూసీ పేరిట లక్షన్నర కోట్ల దోపిడీని ఆపాలన్నారు.

రూ.15 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్ట్‌కు రూ.1.50 లక్షల కోట్లకు పెంచి కమీషన్లు దండుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. తెలంగాణ నిండా అప్పుల్లో మునిగి పోయిందని, బీఆర్‌ఎస్ చేసిన అప్పులు తీర్చేందుకు గంటకు రూ.3 కోట్ల మిత్తి కట్టాల్సి వస్తోందని మంత్రులు మొత్తుకుంటున్నారని అన్నారు.

జీతాలకే ఇబ్బంది ఉందని, మళ్లీ లక్షన్నర కోట్లు అప్పు తెచ్చి జనంపై రుద్దడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత కుటుంబానికి కాంట్రాక్ట్ కట్టబెట్టడానికి తెలంగాణ ప్రజల జీవితాలను ఫణంగా పెడతారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుం బం లక్ష కోట్లు దోచుకుంటే.. మీరు లక్షన్నర కోట్లు దోచిపెట్టడానికి మూసీని వాడుకుంటారా? అన్నారు. మాజీ సర్పంచుల తరఫున బీఆర్‌ఎస్ ఆందోళన సిగ్గు చేటని, చంపినోడే సంతాప సభ పెట్టినట్లుగా ఉందని అన్నారు. మొదటి నుంచి సర్పంచుల సమస్యలపై పోరాటం చేసింది బీజేపీయేనని అని గుర్తు చేశారు. శంషాబాద్‌లో ఆంజనేయ స్వామి ఆలయంపై దాడి అమానుషమన్నారు.

తక్షణమే దుండగులను అరెస్ట్ చేయాలని, హిందూ ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి నోరు మెదపడం లేదని అన్నారు. హిందువులంతా రోడ్డెక్కే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను అరిగోస పెడుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, సీనియర్ నాయకులు పడాల గణేష్, బోయిని రాజు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జపాన్ పర్యటనకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

అభినందించిన కలెక్టర్ సత్యప్రసాద్



కలెక్టర్ సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థిని

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గొల్లపల్లి మోడల్ స్కూల్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కలికోట శ్రీజ జపాన్ పర్యటనకు ఎంపిక కాగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మంగళవారం అభినందించారు. ఇన్‌స్పైయిర్ జాతీయస్థాయి మేళాలో పాల్గొన్న విద్యార్థులల్లో ప్రతిభ కనబరిచిన వారికి జపాన్ పర్యటనకు ఎంపిక చేయగా అందులో శ్రీజకు చోటు దక్కింది. రాష్ట్రానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు జపాన్ సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం సకురలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. అందులో జిల్లాకు చెందిన శ్రీజ ఉండడంతో కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. నవంబరు 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జపాన్‌లో జరిగే సకుర కార్యక్రమంలో అధునిక శాస్త్ర సాంకేతికలను విద్యార్థిని శ్రీజ వీక్షించనున్నారు.

బద్ది పోచమ్మకు బోనం



వేములవాడ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బద్దిపోచమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్ది పోచమ్మకు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండి డప్పుచప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అమ్మవారి దర్శనానికి గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించారు. సుమారు మూడు గంటల తరవాత అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి పట్నాలు వేసి ఒడిబియ్యం, అనంతరం నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. భక్తుల తాకిడి పెరగడంతో ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆలయ ఇన్‌చార్జి ఎడ్ల శివసాయికి సూచించారు. అనంతరం బుక్ కౌంటింగ్‌తోపాటు పలు రికార్డులను పరిశీలించారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా మెదలాలని సిబ్బందికి సూచించారు.





రాజన్న దర్శనం కోసం భక్తుల క్యూ, బద్దిపోచమ్మ ఆలయం వద్ద బోనాలతో భక్తులు

కొండగట్టుకు 'కార్తీక' శోభ

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు ● అంజన్న సన్నిధిలో పూజలు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు

మల్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయ స్వామిని సన్నిధానం కార్తీకమాస శోభను సంతరించుకుంది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. మంగళవారం కార్తీక నాగుల చవితి కావడంతో ఆలయం ఉత్తరం వైపు గల నాగ ప్రతిమల వద్ద పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, బేతాళుడి అలయంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ నాంపల్లి ఆధ్వర్యంలో భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

ధర్మపురిలో కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నాలుగో రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చారు. మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు.కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో భక్తులు పూజలు

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురిలో మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, గోదావరి నదిలో భక్తు లు కార్తీక స్నానాలు ఆచరించి, నదిలో కార్తీక దీపాలు వదిలారు. నరసింహుని ఆలయంలో పూజలు చేశారు. ఆలయ ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేసి, లక్ష వత్తులు వెలిగించారు. నాగుల చవితి సందర్భంగా రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాగదేవతకు పాలు పోసి పూజించారు.



నాగ దేవతను పూజిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య తెలిపారు. గౌతమినగర్, తిరుమల్‌నగర్, కట్ట రాంపూర్, కోతిరాంపూర్, భవానీనగర్, శ్రీనివాస్‌నగర్, ప్రొఫెసర్ నగర్, దుర్గాదేవి నగర్, మహాలక్ష్మి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

విద్యుత్ అధికారుల 'పొలం బాట'

కరీంనగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ సెక్షన్ గుంటూర్‌పల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ జె రాజాం, కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రఘు, బొమ్మకల్ ఏఈ అనిల్ కుమార్, ఎస్‌ఎల్‌ఐ ఎండి సత్తార్, ఎల్‌ఐ కొండగట్టు, ఎల్‌యం ఫారూక్ హుస్సేన్ పాల్గొన్నారు.

'కుల గణన చరిత్రాత్మకం'

కరీంనగర్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం నుంచి కుల గణన చేపట్టడం చరిత్రాత్మకమైందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

'విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించాలి'

సుభాష్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల గణనలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించాలని, వృత్తులు వారీగా విడదీయం సరికాదని ప్రభుత్వానికి విశ్వ బ్రాహ్మణ సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి, ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు, జిల్లా కన్వీనర్ రవీంద్రచారి మాట్లాడుతూ ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన కులగణన ఫార్మాట్‌లో జరిగిన పొరపాటును వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు.

వివేకానంద విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ అంతర వర్సిటీ కళాశాలల వాలీబాల్ పోటీల విజేతగా వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జట్టు విజేతగా నిలిచినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 5: ఇంటిగ్రేటెడ్ (సమీకృత) మార్కెట్ పనులను వేగవంతం చేయాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. పద్మనగర్‌లోని సమీకృత మార్కెట్‌ను డిసెంబర్‌లో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. మంగళవారం పద్మనగర్‌లో 14కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్‌తో కలిసి సందర్శించి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. వెజ్, నాన్‌వెజ్, ఫ్రూట్స్ అన్ని ఒకే చోట లభ్యమయ్యేలా అత్యాధునిక హంగులతో నగరంలో నాలుగు సమీకృత మార్కెట్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. పద్మనగర్ మార్కెట్‌లో 138 వెజ్, 38 నాన్ వెజ్ స్టాల్స్ వేర్వేరుగా నిర్మాణం చేశామన్నారు. మార్కెట్‌లో 22 ప్రత్యేక షెట్టర్లను నిర్మాణం చేశామని, వాటిని ఇతర కిరాణానికి సంబంధించిన పదార్థాలు అమ్ముకునేలా వసతి కల్పించామని చెప్పారు. మార్కెట్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని మరో మార్కెట్‌లో, కాశ్మీరుగడ్డ పాత రైతు బజార్ స్థలంలో కూడా పనులు జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం ముందు 60శాతం పనులు పూర్తయ్యాయని మేయర్ సునీల్‌రావు ఈసందర్భంగా అన్నారు. ఈ నాలుగు సమీకృత మార్కెట్లను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా నగర పాలకవర్గం కృషి చేస్తుందని చెప్పారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణగౌడ్, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ సుబ్రహ్మణ్యం, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

మత్తు పదార్థాలపై అవగాహన

భగత్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్హెచ్ విజయభాస్కర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాల వల్ల మానసికంగా శారీరకంగా ఆర్థికంగా, సామాజికంగా ఎదురయ్యే ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. ఈ సదర్భంగా పాఠశాలలో కాన్సియస్నెస్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుమ్మ ఆనందం, ఉపాధ్యా యులు, చైల్డ్ కేర్ 1098 సిబ్బంది రమేష్, సాయికిరణ్, ఎక్సైజ్ సిబ్బంది భూమయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రేపు వ్యాసరచన పోటీలు

కరీంనగర్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా గురువారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీ తెలిపారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హుస్సేనిపురలోని నేషన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్స

సుభాష్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త గాలిపెల్లి కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్స చేయించాడు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ముత్తయ్య బైక్‌పై వెళుతున్న క్రమంలో కంటిలో ధూళి పడింది. కంటిని ఎక్కువగా నలపడంతో కంటిపొర పల్చబడింది. రేకుర్తి కంటి ఆసుపత్రి డాక్టర్లను సంప్రదించగా హైదరాబాద్‌లో కంటి శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. దాంతో వారు సామాజిక కార్యకర్త గాలిపెల్లి కుమార్‌ను సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించాడు.

'హామీలను నెరవేరుస్తాం'

కరీంనగర్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ అన్నారు. ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని ఆయన విమర్శించారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ నాయకులు నేహాల్ అహ్మద్, చాంద్, ఖాజాఖాన్, జమీల్, హనీఫ్, అజీం, షబానా, మెరాజ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కరీంనగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, డిప్యూటీ లీగల్ కౌన్సిలర్ టి మహేష్ హాజరై విద్యార్థినిలకు నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించారు. విద్యార్థినిలకు కన్స్యూమర్ యాక్ట్, గృహ హింస చట్టం, సైబర్ సెక్యూరిటీ ర్యాగింగ్, డ్రగ్స్ మొదలగు వాటి గురించి వివరించారు. అనంతరం కళాశాల ఆవరణను పరిశీలించారు. వంట గదులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.టి.మాలతి, సీనియర్ అధ్యాపకులు పి.శంకరయ్య, ఈ వెంకటేశ్వర్లు, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి కె గీతారాణి, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మహేష్

సర్వేకు సర్వం సిద్ధం

(3వ పేజీ తరువాయి)

స్టిక్కరింగ్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ప్రత్యేకాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సర్వే ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ఇళ్ల జాబితా సిద్ధం చేసి, ప్రతి ఇంటికి స్టిక్కరింగ్ చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు విధిగా 10శాతం ఇళ్లను సందర్శించాలని, ప్రత్యేకాధికారులు సర్వే తీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. సర్వే సమాచారాన్ని కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని, ఇందుకోసం ఎంపీడీవోలు, అధికారులు కంప్యూటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను సమకూర్చుకోవాలని సూచించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేకు కావలసిన స్టేషనరీ ఇప్పటికే ఆయా కేంద్రాలకు పంపిం చామని తెలిపారు. అధికారులు సంబంధిత ఇళ్ల వివరాలను ప్రజలందరికి ముందుగా తెలియజేయాలని సూచించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

కరీంనగర్ రూరల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళా కార్యక్రమంలో మహిళలను, వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్నీ రికార్డులను పరిశీలించారు. ఓపి సేవలు, రక్త పరీక్షలు, ఫార్మసీ గురించి డాక్టర్ మనోహర్, డాక్టర్ సల్మాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

కరీంనగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని మండల విద్యాధికారి కె రవీందర్ ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులతో, ప్రధానోపాధ్యాయులతో దుర్శేడ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పిఎస్‌వి రత్నాకర్, ప్రధానోపాధ్యాయులు సి రమాదేవి, బి పద్మ, అబ్దుల్‌బాసిత్, కె జలజ, సీఆర్‌పిలు పాల్గొన్నారు.

సీఐ కుటుంబానికి ఆర్థిక సహాయం

కరీంనగర్ క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన సీఐ రాజేష్ కుటుంబానికి తోటి సీఐలు మంగళవారం 4లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వరంగల్ ఆటోనగర్‌కు చెందిన సైరీ రాజేష్(42) 2007వ బ్యాచ్ ఎస్ఐగా చేరి సీఐగా పదోన్నతి పొంది పలు ప్రాంతాల్లో పని చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఫిబ్రవరిలో మరణించాడు. మృతుడికి భార్య రాధ, కూతురు హాసిని(11) కొడుకు కార్తీకేయ(8) ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు రమేష్, శ్రీనివాస్, సంతోష్, కుమార్, విజయ్‌కుమార్, కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో నగరంలో అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ఆనాటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి కరీంనగర్‌ను సుందరనగరంగా తీర్చిదిద్దారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, నగర యూత్ అధ్యక్షుడు దీకొండ కుల్దీప్‌వర్మ, మైనార్టీ ప్రధాన కార్యదర్శి వాజిద్, చందు, డివిజన్ అధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని 117 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి 117 మంది లబ్ధిదారులకు 27,73,592 రూపాయల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, ఎదుల్ల రాజశేఖర్, నాంపల్లి శ్రీనివాస్, నాయకులు గందె మహేశ్, తులా బాలయ్య, సుధగోని కృష్ణగౌడ్, దుర్శేడ్ మాజీ సర్పంచు సుంకిశాల సంపత్‌రావు, మాజీ సర్పంచు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లె, కనగర్తి, లక్ష్మాజిపల్లె, సిరిసేడు, పాతర్లపల్లి, మల్లివానిపల్లె, టేకుర్తి, బూజునూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

గణేశ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రం ఓ ప్రైవేటు కార్యక్ర మంలో పాల్గొనడానికి కరీంనగర్‌కు రాగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగారాం, రామయ్య, రాజేందర్, మడిపెల్లి శంకర్, గాలిపెల్లి కుమారస్వామి, జేరిపోతుల శంకర్, చిట్యాల చంద్రయ్య, బోయినపల్లి చంద్రయ్య, బండ శ్రీనివాస్, గాలిపెల్లి శ్రీనివాస్, గోస్కి శంకర్ , నాగెల్లి దేవేందర్, అసంపల్లి నాగరాజ్, మడిపెల్లి శంకర్, జక్కనపల్లి గణేష్, వాళ్లంపట్ల శ్రీనివాస్, గాలి అనిల్, దండు మధు, దండు అంజయ్య ఇతర దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

భగత్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మల్కాపూర్ రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి 15 రోజులు గడుస్తోందని, ప్రభుత్వంకొనుగోలు చేస్తుందని ఆశగా రైతులు ఎదురు చూస్తున్నారన్నారు.

ఆర్థిక సహాయం

రామడుగు, నవంబరు 5 : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో బేడ బుడగ జంగం(ఎస్సీ)కులానికి చెందిన మాదవేని పోచమ్మ(78) అనే వృద్ధురాలు మృతి చెందగా వారి కుటుంబానికి మంగళవారం బేడ బుడగ జంగం యూత్ కమిటీ సభ్యులు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ అధ్యక్షుడు పురాణం రమేష్, కల్లెం గంగారం పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాల సందర్శన

చొప్పదండి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) చొప్పదండి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌వి జనార్దన్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పలు విషయాలపై మాట్లాడారు. ఆంగ్ల భాష పై విద్యార్థులకు ఉన్న పరిజ్ఞానాన్ని పరీక్షించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థిని సింధు ఇంగ్లీష్‌లో చెప్పిన సమాధానాలకు అయన అభినందిస్తూ వంద రూపాయల నగదు బహుమతిని అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగం శ్రీనివాసరావు ,ఉపాధ్యాయులు ఆర్ మహేష్, శ్రీనివాస్ రెడ్డి, బల్మూరి పల్లవి, తిరుపతి, ముకుంద రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఎండీలో చేపల వలల చోరీ

గన్నేరువరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మానేరు డ్యాం జలాశయంలో అమర్చిన సుమారు ఆరు లక్షల విలువ గల వలలను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. నెల రోజుల్లో ఆరు సార్లు వలల చోరీ జరిగిందని మత్స్యకారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత మత్స్యకారులు మీడియాతో మాట్లాడుతూ తమ గోడును వెల్లబోసుకున్నారు. చేపల వలల దొంగలను పట్టుకుని తమ వలలను ఇప్పించి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

రేపటి నుంచి ఒంటి పూట బడులు

ఇల్లందకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమగ్ర సర్వే సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు ఒంటి పూట బడులు ఉంటా యని ఎంఈవో రాములు ఓ ప్రకటనలో తెలిపారు. కుల గణన సర్వేలో ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొంటా రని, ప్రైమరీ పాఠశాలలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పని చేస్తాయని తెలిపారు.

రైతు ఇంటి వద్దనే రిజిస్ట్రేషన్

చొప్పదండి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటలో రైతు ఇంటికి వెళ్లి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశారు. గ్రామానికి చెందిన జేరిపో తుల లక్ష్మికి ఎకరం 20 గుంటల భూమి ఉంది. ఆ భూమిని తన నలుగురు కుమారులకు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం మూడు నెలల క్రితం స్లాట్ బుక్ చేసుకుంది. లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న తహసీల్దార్ నవీన్‌కుమార్ లక్ష్మి ఇంటికి వెళ్లి కుమారు లకు రిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగరాజు, ధరణి ఆపరేటర్లు మౌనిక, స్వామి, మహ్మద్ జమీల్, సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ చేస్తున్న తహసీల్దార్

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సిర్సపల్లి విద్యార్థిని

హుజూరాబాద్ రూరల్, నవంబరు 5: మండలంలోని సిర్సపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎండీ సన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న హుజూరాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 పోటీల్లో ప్రతిభ చూపిన సన భువనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందన్నారు.



ఎండీ సన

ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలి

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల రాస్తారోకో

గంగాధర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. గంగాధర ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులైనా ధాన్యం తూకం వేయడంలేదన్నారు. ఇప్పటికీ కేంద్రాలకు మిల్లులు కేటాయించలేదని విమర్శించారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడిసి రైతులు ఇబ్బందుపడుతున్నారన్నారు. ధాన్యాన్ని కొనే వారు లేక క్వింటాల్‌కు ఐదు వందల రూపాయలు తక్కువ ధరకు రైతులు మిల్లర్లకు అమ్ముకుంటున్నారని తెలిపారు. కేంద్రాల్లో కనీసం సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. ప్రధాన రహదారిపై రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ అక్కడికి వచ్చి నిరసన కారులను స్టేషన్‌కు తరలించారు.



గంగాధరలో రాస్తారోకో చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

హుజూరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా మంగళవారం డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్ శ్రావణ్‌కుమార్, హెచ్‌ఎం తిరుమల పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా గుండేటి వాసుదేవ్

సైదాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుండేటి వాసుదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కదిరే రమేష్ అధ్యక్షతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా ఎండీ హుస్సేన్, కె మల్లేషం, రాయమల్లు, మల్లయ్య, శంకర్, శ్రీనివాస్, పద్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో సభలు

సైదాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూర్, రాయికల్ గ్రామాలలో గౌరవెల్లి రిజర్వాయర్ కాలువ కింద భూములు కోల్పోతున్న రైతులతో హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతులు కాలువ నిర్మాణానికి సహకరించాలని కోరారు. త్వరలోనే పరిహారం చెల్లించి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఇరిగేషన్ డీఈ చైతన్య, ఈఈ రాములు, ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

● చిగురుమామిడి: మండలంలోని నవాబ్‌పేటలో గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ భూసేకరణ నోటిఫికేషన్‌పై గ్రామ సభ నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎల్‌ఏ ఆర్‌అండ్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కిరణ్ ప్రకాశ్ మాట్లాడుతూ గౌరవెల్లి కెనాల్ నిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన 44 ఎకరాల భూమిని సేకరిస్తామన్నారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను అధికారులు చదివి వినిపించినారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి అభ్యంతరాలు, సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈ ప్రశాంత్, ఏఈ నెహ్రూ, ఆర్ఐ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేలో అందరూ భాగస్వాములు కావాలి

మానకొండూర్, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఈ నెల ఆరో తేది నుంచి నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు భాగస్వాములు కావాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఓ ప్రకటనలో కోరారు. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపడుతోందని తెలిపారు. 6 నుంచి నెలాఖరు వరకు నిర్వహించనున్న ఈ సర్వేకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. సమన్యాయం కోసమే సర్వేను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వే అధికారులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని సూచించారు.

మట్టి తవ్వకాలపై అధికారుల విచారణ



రంగాపూర్‌లో విచారణ జరుపుతున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 5: మండలంలోని రంగాపూర్, సిర్సపల్లి గ్రామల శివారులోని పాండవుల గుట్ట సమీపంలో అసైన్డ్ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారనే ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు, మైనింగ్, జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ రామాచారి ఆధ్వర్యంలో అధికారులు విచారణ జరిపారు. క్రషర్లు, క్వారీలను అధికారులు పరిశీలించారు. రెండు క్రషర్ కంపెనీలను డీఫాల్టర్లుగా గుర్తించారు. ఆయా క్రషర్ల ఫ్యూజులు తొలగించి, విద్యుత్ కనెక్షన్లు తొలగించి తదుపరి చర్యలకు విద్యుత్ శాఖాధికారులకు సిఫారసు చేశారు. అనుమతి లేకుండా జరిపిన మట్టి తవ్వకాలపై డీబీఎల్ కంపెనీకి ఇంతకు ముందు 1.35 కోట్ల ఫైన్ విధించినట్లు అధికారులు తెలిపారు. డీబీఎల్ పరిధిలో చెక్‌పోస్ట్, క్వారీ వద్ద కంపౌండ్ వాల్ నిర్మించి, జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాలను గుర్తించి పోలీసులకు, అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈటీఎస్ సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మట్టి తవ్వకాల బాధిత రైతులు అందుబాటులో లేకపోవడంతో పూర్తి విచారణ జరపకుండానే అధికారులు వెనుదిరిగారు. బాధితులందరూ వస్తే విచారణ జరిపి న్యాయం చేస్తామని ఫిర్యాదుదారులు కోడూరి సమ్మయ్య, మాజీ సర్పంచ్ ఆరెపల్లి ఎల్లయ్య, కండె తిరుపతికి అధికారులు హామీ ఇచ్చారు.

● సంక్షిప్త సమాచారం..

● జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,950 రూపాయలు పలికింది.

- హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత డబ్బులు ఇప్పించాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘ నియోజక వర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

● హుజూరాబాద్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

- పట్టణంలోని పోచమ్మ ఆలయం ఎదుట సీసీ ప్లాట్ ఫామ్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ప్రారంభించారు.

● శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గద్దపాకకు చెందిన భూమ సంపత్ బెల్ట్‌లు, ఐడీ కార్డులు పంపిణీ చేశారు.

● మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన దంపతులు కోంద్ర పవన్‌కళ్యాణ్, ప్రహర్ష ఇటీవల మృతి చెందారు. వారి పిల్లలు ఆద్యశ్రీ, ఆయాన్ష్‌కు ఎస్పీఎఫ్ ట్రస్టు, జగిత్యాల మిత్ర బృందం సభ్యులు లక్షా 30వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేశారు.

● తిమ్మాపూర్ (మానకొండూర్): మండల కేంద్రంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాన్షియష్ క్లబ్ ఏర్పాటుతో పాటు మాదక ద్రవ్యాల నిర్మూలనపై శ్రీ చైతన్య పాఠశాలలో అవగాహన కల్పించారు.

● గంగాధర: మండల రెడ్డి సంఘం అధ్యక్షుడిగా సుద్దాల రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వంశీక్రిష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రఘునందన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా కాడం వీరారెడ్డి, మల్లారెడ్డి ఎన్నికయ్యారు.

- మండలంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మధుసూదన్ డిమాండ్ చేశారు.

● గన్నేరువరం: ఖాసింపేట మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిని తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా మల్లేశం, ఉపాధ్యక్షుడిగా మల్లయ్య, లచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా దర్శనాల సతీష్, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా మహేష్‌ను ఎన్నుకున్నారు.

●సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం రెండో రాజధాని చేయాలనుకుంటే కరీంనగర్ ను చేయాలని ప్రజామిత్ర ప్రోగ్రెసీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు.